సమస్యలపై వెంటనే స్పందించాలి

కలెక్టర్ ప్రావీణ్య

ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

సంగారెడ్డి కలెక్టరేట్, జూన్ 16 : జిల్లాలో నెలకొన్న సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కరించాలని కలెక్టర్ ప్రావీణ్య ఆయా శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సారి సోమవారం వివిధ శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఆయా శాఖలకు సంబంధించి తన వద్దకు పంపే ఫైళ్లకు పూర్తి సమాచారంతో జత చేసి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పంపించాలని స్పష్టం చేశారు. జిల్లాలో తలెత్తే సమస్యలకు సంబంధిత శాఖల అధికారులు వెంటనే స్పందించి వెంటనే తనకు నేరుగా ఫోన్ ద్వారా, వాట్సాప్ ద్వారా సమాచారం అందించాలి. అదేవిధంగా ఆయా శాఖలలో పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను వెంటనే క్లియర్ చేయాలని సూచించారు. నివేదికల్లో తాజా సమాచారం అందుబాటులో ఉండాలన్నారు. అధికారులు జిల్లా పర్యటనలకు వెళ్లినప్పుడు ఆయా ప్రాంతాలకు సంబంధించిన పూర్తి సమాచారం అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు. ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే అధికారులు స్పందించాలన్నారు. తమ వద్ద పెండిం గ్ ఫైళ్లు లేకుండా చూడాలన్నారు. అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్వో పద్మజారాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ప్రజావాణికి 63 ఫిర్యాదులు

కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణ కార్యక్రమానికి 63 ఫిర్యాదులు అందాయి. ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 15 ఫిర్యాదులు ఉండగా, పౌర సరఫరాలు 2, మార్క్‌ఫెడ్ 1, సర్వే ల్యాండ్ 9, పంచాయతీ, పీటీ, విభాగం 4, పంచాయతీ రాజ్ 2, డీఆర్డీవో 4, మున్సిపల్ 9, వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ 10, విద్యాశాఖ 2, జిల్లా యువజన సంక్షేమ శాఖ 1, వ్యవసాయశాఖ 4 ఫిర్యాదులు ఉన్నాయి. ఆయా అర్జీలను జిల్లా అదనపు కలెక్టర్లతో కలిసి స్వీకరించిన కలెక్టర్ వాటిని సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా వాణి ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధు రి, డీఆర్వో పద్మజారాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు భంగం కలుగకుండా చూడాలి

కంగ్టి పోలీస్‌స్టేషన్‌లో సిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ పారితోష్ పంకజ్

కంగ్టి, జూన్ 16 : మండలంలో శాంతిభద్రతలకు భంగం వాటిల్లకుండా చూడాలని జిల్లా ఎస్పీ పారితోష్ పంకజ్ అన్నారు. సోమవారం కంగ్టి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కంగ్టి మండలం జిల్లా కేంద్రానికి దూరంగా ఉందన్నారు. కంగ్టి మండలానికి కర్నాటక రాష్ట్రం సరిహద్దు ప్రాంతంగా ఉందని, అక్రమ రవాణా జరగకుండా చూడాలని స్థానిక ఎస్సై, సీఐలకు సూచించారు. ఎస్పీ వెంట నారాయణఖేడ్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి, కంగ్టి సీఐ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్సై దుర్గారెడ్డి ఉన్నారు.

ఖేడ్' పోలీస్‌స్టేషన్ సందర్శించిన ఎస్పీ

నారాయణఖేడ్, జూన్ 16 : ఎస్పీ పారితోష్ పంకజ్ నారాయణఖేడ్ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. శాంతిభద్రతల పరిస్థితిపై స్థానిక డీఎస్పీ వెంకట్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర సరిహద్దున ఉన్న కంగ్టి, నాగల్‌గిద్ద పోలీస్‌స్టేషన్ల పరిధిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీఐ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై విద్యాచరణ్‌రెడ్డిలకు ఎస్పీ పలు సూచనలు చేశారు.

తాగు నీటి సమస్యను పరిష్కరించాలి

ఖాజాపూర్‌లో బోరు వద్ద నీళ్లు పట్టుకుంటున్న స్థానికులు

సిర్గాపూర్, జూన్ 16 : మండలంలోని ఖాజాపూర్‌లో తాగు నీటి సమస్య నెలకొంది. స్థానికంగా మిషన్ భగీరథ నీటి సరఫరా సక్రమంగా లేకపోవడం వల్లనే నీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. గ్రామ శివారులోని వ్యవసాయ రైతులకు సంబంధించి రెండు బోర్లు అద్దెకు తీసుకొని, గ్రామంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీలో నీరందించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు. మిషన్ భగీరథ పథకం నీటి సరఫరా ద్వారా ఇంటింటికి నల్లా నీరందిస్తే ఈ సమస్య తీరుతుందని గ్రామస్తులు అంటున్నారు. ఈ విషయమై సంబంధిత గ్రామీణ నీటి పథకం ఏఈ జైపాల్‌ను విచారించగా, గ్రామానికి రెండు అద్దె బోర్లతో ప్రజలకు నీరందిస్తున్నామని చెప్పారు. నీటి సరఫరా పైప్‌లైన్ మరమ్మతులు చేపట్టి, నల్లాల ద్వారా నీరందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రైతు నేస్తం రైతులకు ఎంతో మేలు

రంజోల్ రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ప్రారంభోత్సవానికి హాజరైన ప్రజాప్రతినిధులు

జహీరాబాద్, జూన్ 16 : రైతులకు అత్యుత్తమ సాంకేతిక పరిజ్ఞానంతో సేవలందించడం కోసం రైతు నేస్తం కార్యక్రమంతో ఎంతగానో మేలు చేస్తుందని సెట్విన్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ గిరిధర్‌రెడ్డి అన్నారు. సోమవారం జహీరాబాద్ మండలంలోని రంజోల్, కోత్తూర్ (బి), న్యాల్‌కల్ మండలంలోని మామిడ్గి గ్రామాల్లోని రైతు వేదికలో వీడియో కాన్ఫరెన్స్ ప్రారంభోత్సవం చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ సాయిచరణ్, తిరుపతిరెడ్డి, వ్యవసాయ సహాయ సంచాలకులు భిక్షపతి, వ్యవసాయాధికారులు లావణ్య, అవినాశ్ వర్మ, విస్తరణ అధికారులు ప్రదీప్‌కుమా ర్, వీరేందర్, ప్రసంతి, నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కానుకుంట రైతువేదికలో..

గుమ్మడిదల, జూన్ 16 : మండలంలోని కానుకుంట రైతువేదికలో రైతులకు మండల వ్యవసాయాధికారులు వీడియో కాన్ఫరెన్స్‌ను నిర్వహించారు. సోమవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి రైతుల కోసం, వారు సాగు చేసి పంటల కోసం వివరించారు. దీనిని మండల వ్యవసాయాధికారి డీ. శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో నిర్వహించగా, ఆత్మకమిటీ చైర్మన్ కొత్తపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పటాన్‌చెరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్. మనోహర, పటాన్‌చెరు వ్యవసాయాధికారి శివకుమార్, ఏఈవో ప్రణవి, డివిజన్ అధికారులు పాల్గొన్నారు.

సిర్గాపూర్‌లో..

సిర్గాపూర్, జూన్ 16 : మండలంలోని కడ్పల్, ముబారక్‌పూర్, సిర్గాపూర్ రైతు వేదికల్లో రైతు నేస్తం వీసీ ప్రత్యక్ష ప్రసార కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం రైతులు వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఏ వో హరి కృష్ణ, ఏఈవో భాస్కర్, శివ కుమా ర్, మాజీ సర్పంచ్‌లు, రైతులు ఉన్నారు.

ప్రాథమిక పాఠశాలను పరిశీలించిన కార్పొరేటర్

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి

రామచంద్రాపురం, జూన్16 : భారతీనగర్ డివిజన్‌లోని బొంబాయికాలనీలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి పరిశీలించారు. పాఠశాలలో మౌలికవసతులు, ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థులకు అందుతున్న బోధన తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని, విద్యార్థుల సంఖ్య పెరిగేలా చూడాలని ఉపాధ్యాయులకు ఆమె సూచించారు. బడికి రాని విద్యార్థుల వివరాలను సేకరించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలను బడికి పంపించే విధంగా చూడాలన్నారు. పాఠశాలలో ఉన్న సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని, పాఠశాల అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటామని ఉపాధ్యాయులకు తెలిపారు. ఆమెతో పాటు బీఆర్ఎస్ నేత నర్సింహ తదితరులు ఉన్నారు.

మాకు న్యాయం చేయండి..

కొల్లూర్ పీఎస్‌లో ఫిర్యాదు చేసిన లక్ష్మీపురం ప్లాట్ ఓనర్స్

కొల్లూర్ పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ రవీందర్‌తో మాట్లాడుతున్న ప్లాట్ ఓనర్స్

రామచంద్రాపురం, జూన్16 : పైసా.. పైసా కూడబెట్టి కొనుకున్న ప్లాట్లలోకి తమనే రానివ్వకుండా కొందరు ప్రైవేట్ వ్యక్తులు బెదిరింపు చర్యలకు పాల్పడుతున్నారని కొల్లూర్ లక్ష్మీపురం ప్లాట్ ఓనర్స్ సోమవారం పోలీసులను ఆశ్రయించారు. కొల్లూర్ ఇన్‌స్పెక్టర్ రవీందర్‌ని ప్లాట్ ఓనర్స్ కలిసి ఫిర్యాదు చేసి వారి బాధను చెప్పుకున్నారు. తెల్లాపూర్ మున్సిపాలిటీ కొల్లూర్ గ్రామంలో పలు సర్వే నంబర్‌లల్లో 1984లో చేసిన లేఅవుట్‌లో భవిష్యత్ అవసరాల కోసం సుమారుగా 1600 మంది ప్లాట్లు కొనుకున్నారు. మాప్లాట్‌లకు సంబంధించిన భూములపై ఇతరులు ఆక్రమించుకోవడానికి ప్రయత్నం చేయడంతో న్యాయ పోరాటం చేస్తున్నామని చెప్పారు. గతంలో లోకాయుక్తలో కూడా ప్లాట్ ఓనర్స్‌కి అనుకూలంగా తీర్పు వచ్చిందన్నారు. తమ ప్లాట్లకు సంబంధించిన భూమిలోకి తమని రానివ్వకుండా గుండాలను పెట్టి తమని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నేండ్లుగా తమ ప్లాట్లను దక్కించుకోవడానికి తిరుగుతున్నామని, తమకు న్యాయం చేయాలని ఇన్‌స్పెక్టర్ రవీందర్‌ని ప్లాట్ ఓనర్స్ కోరారు. దీనికి స్పందించిన ఆయన ఫిర్యాదుకు లేఅవుట్, కోర్టు తీర్పుని, ఆయా సర్వేనంబర్లలో ఏ భూమిలో ఎంత మంది ప్లాట్ ఓనర్స్ ఉన్నారనే లిస్ట్‌ని జత చేసి ఇస్తే దాని ప్రకారం కేసు నమోదు చేసి న్యాయం చేయడానికి తమవంతు కృషి చేస్తామని ప్లాట్ ఓనర్స్‌కి హామీ ఇచ్చారు. దీంతో ఇన్‌స్పెక్టర్ సూచనల మేరకు అన్ని ప త్రాలను సమర్పిస్తామని, మా ప్లాట్లు మాకు దక్కెలా చూడాలని వారు కోరారు.

ఫిట్‌నెస్‌లేని నాలుగు బస్సులు సీజ్

పటాన్‌చెరు రూరల్, జూన్ 16 : ఫిట్‌నెస్‌లేని, అనుమతులు లేని నాలుగు స్కూల్, కాలేజీ బస్సులను పటాన్‌చెరు ఎంవీఐ ఆర్. విజయరావు సీజ్ చేశారు. సోమవారం పటాన్‌చెరు మండలంలో వేర్వేరు ప్రాంతాల్లో రవాణాశాఖ అధికారులు స్కూల్ బస్సులు, కాలేజీ బస్సులను తనిఖీ నిర్వహించారు. పటాన్‌చెరు మోటర్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ విజయరావు ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో 4 వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎంవీఐ మాట్లాడుతూ ప్రత్యేకంగా స్కూల్ పిల్లల వాహనాలపై నిఘా ఉంటుందన్నారు. విద్యార్థుల భద్రత అత్యంత కీలకమైన విషయంగా పరిగణిస్తున్నట్లు చెప్పారు.

ఐఐటీహెచ్‌లో ముగిసిన శాస్త్రవేత్తల సదస్సు

కంది, జూన్ 16 : సంగారెడ్డి జిల్లా కందిలోని ఐఐటీ హైదరాబాద్‌లో వారం రోజులుగా కొనసాగుతున్న యువ శాస్త్రవేత్తల సదస్సు సోమవారం ముగిసింది. ఈ సదస్సులో 60 దేశాల నుంచి 200 మందికి పైగా యువ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు. మానవాళి ఎదుర్కొంటున్న ప్రపంచ సవాళ్లు, ఆసియా-పసిఫిక్ ప్రాంతానికి చెందిన పన్నెండు జాతీయ యువ అకాడమీల నాయకత్వం, ప్రాంతీయ సమన్వయాన్ని బలోపేతం చేయడం, ఉత్తమ పద్ధతులను మార్పిడి చేసుకోవడం, సైన్స్ దౌత్యాన్ని ముందుకు తీసుకెళ్లడం, సామర్థ్య నిర్మాణం స్థిరమైన అభివృద్ధి తదితర అంశాలపై సదస్సులో చర్చలు, సమావేశాలు జరిగాయి. ఈ ప్రాంతంలోని యువ శాస్త్రవేత్తల గొంతును బలోపేతం చేసేందుకు ఆసియా-పసిఫిక్ యువ అకాడమీల నెట్‌వర్క్ (నయా)ను ప్రారంభించేందుకు సదస్సులో ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా ఐఐటీహెచ్ డైరెక్టర్ ప్రొఫెసర్ బీఎస్ మూర్తి మాట్లాడుతూ ప్రపంచ దేశాలకు చెందిన యువ శాస్త్రవేత్తల సదస్సును ఐఐటీహెచ్‌లో నిర్వహించడం గర్వంగా ఉందన్నారు. యువ శాస్త్రవేత్తల తెలివైన మనస్సులను ఒకచోట చేర్చడం ద్వారా అంతర్జాతీయ శాస్త్రీయ సంభాషణను బలోపేతం చేయడంతో పాటు మెరుగైన ఆవిష్కరణలకు దోహదపడుతుందన్నారు. గ్లోబల్ యంగ్ అకాడమీ ఇమ్మీడియట్ పాస్ట్ కో-చైర్మన్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ శర్మ, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

ఇండ్లను సద్వినియోగం చేసుకోవాలి

ఇండ్ల మంజూరు పత్రాలను అందజేస్తున్న మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి

జహీరాబాద్, జూన్ 16 : ఇందిరమ్మ ఇండ్లను నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తిరుపతిరెడ్డి అన్నారు. సోమవారం న్యాల్‌కల్ మండలంలోని గణేశ్‌పూర్ గ్రామంలోని ఆయన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ముగ్గులు వేసి పనులను ప్రారంభించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఇండ్లను నిర్మించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు. అనంతరం లబ్ధిదారులకు ఇండ్ల మంజూరు పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు అశోక్, బలరాం రెడ్డి, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

గాడిద పాలకు భలే డిమాండ్

- కర్ణాటక, మహారాష్ట్రల నుంచి వ్యాపారం
- పిల్లల దగ్గు, ఆయాసానికి వినియోగిస్తున్న ప్రజలు

హద్నూర్‌లో తిరుగుతూ గాడిద పాలను విక్రయిస్తున్న వ్యాపారులు

జహీరాబాద్, జూన్ 16 : గంగి గోవులపాలు గరిటడైనను చాలు..కడివడైననేమి కరమ పాలు.. ఇది ఒకప్పుడు అందరూ చదువుకున్న పద్యపాదం. ఆవుపాల ముందర గాడిద పాలు ఎందుకూ పనికిరావని దీని అర్థం. అయితే పరిస్థితి ఇప్పుడు మారిపోయింది. గాడిద పాలకే ఎక్కవ డిమాండ్ వచ్చింది. పిల్లల దగ్గు, ఆయాసం తగ్గడానికి విటిని వినియోగిస్తుండడంతో లీటరు పాలు రూ.10 వేల వరకు పలుకుతున్నాయి. పది మిలీ. పిల్లలకు తాపితే దగ్గు, ఆయాసం, ఆకలి లేకపోవడం వంటి వ్యాధులు నయమవుతాయని మారుమూల గ్రామాల ప్రజల నమ్మకం. దీంతో 10 ఎంఎల్ పాలు రూ. 100 నుంచి 150 వరకు విక్రయిస్తున్నారు. సోమవారం కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ ప్రాంతాలకు చెందిన గాడిద పాల వ్యాపారులు జహీరాబాద్, న్యాల్‌కల్ మండలాల్లోని పలు గ్రామాల్లో తిరుగుతూ వ్యాపారం చేశారు. చిన్న పిల్లలు ఉన్న ఇంటి దగ్గరకు వెళ్లి వాటిని విక్రయించారు. వారు అమ్మే ధరను చూస్తే లీటరు గాడిద పాలు రూ. 10 వేల వరకు పలుకుతున్నాయి. ఈ సందర్భంగా మహారాష్ట్రకు చెందిన గాడిద పాల వ్యాపారి మాట్లాడుతూ గ్రామాలు తిరుగుతూ గాడిద పాలు అమ్ముతున్నామని చెప్పారు. ఆ విధంగా న్యాల్‌కల్, జహీరాబాద్ మండలాలకు వచ్చినట్టు పేర్కొన్నారు. ఈ పాలు చిన్న పిల్లలకు ఎంతో ఆరోగ్యాన్నిస్తాయని, ఒక గాడిద రోజుకు 200 ఎంఎల్ నుంచి 250 ఎంఎల్ పాలు ఇస్తుందని తెలిపారు. రోజుకు ఒకటి, రెండు గ్రామాలకు వెళ్లి గాడిద పాలను విక్రయిస్తు రూ. 2 నుంచి 3 వేల వరకు సంపాదిస్తున్నామని పేర్కొన్నారు.

కేసీఆర్ నగర్‌లో ప్రభుత్వ పాఠశాల ఏర్పాటు చేయాలి

కలెక్టర్ ప్రావీణ్యకు సమస్యను వివరిస్తున్న పీఏసీఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, నర్సింహులు

రామచంద్రాపురం, జూన్ 16 : తెల్లాపూర్ మున్సిపాలిటీ కొల్లూర్‌లో ఉన్న కేసీఆర్ నగర్ 2బీహెచ్‌కే ఇండ్ల సమూదాయంలో వెంటనే ప్రాథమిక, ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేయించాలని కలెక్టర్ ప్రావీణ్యను తెల్లాపూర్ పీఏసీఎస్ చైర్మన్ మల్లేపల్లి బుచ్చిరెడ్డి కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో బుచ్చిరెడ్డి, వడ్డె నర్సింహులు కలెక్టర్‌ని కలిసి వినతిపత్రం అందజేశారు. కేసీఆర్ నగర్‌లో సుమారుగా 20వేల కుటుంబాలు నివాసానికి అవకాశం ఉన్నదని, ఇప్పటికే 70 శాతం కుటుంబాలు నివాసం ఉంటున్నారని తెలిపారు. అందులో ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులకు పాఠశాలలు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారని వారు కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. తెల్లాపూర్ జడ్పీహెచ్ఎస్‌లో సుమారుగా 500 మంది విద్యార్థులు చేరారని, తెలుగు, ఇంగ్లిష్ మీడియం విద్యాభోదన ఉనప్పటికీ ఏడుగురు రెగ్యులర్ ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని, వెంటనే ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. లేనిపక్షంలో విద్యార్థులకు విద్యాబోధన కష్టంగా మారుతుందని తెలిపారు.

కొండాపూర్‌లో కలెక్టర్ పర్యటన

ఇందిరమ్మ ఇండ్లకు భూమి పూజ చేస్తున్న కలెక్టర్ ప్రవీణ్య

కొండాపూర్, జూన్16 : కొండాపూర్ మండలంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సోమవారం సుడిగాలి పర్యటన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులతో మాట్లాడేందుకు మండలంలో పర్యటించానన్నారు. కొండాపూర్ మండలం ఫైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక కావడంతో మండలంలో దాదాపుగా అన్ని గ్రామాల్లో భూ సమస్యల పరిష్కారికే భూ భారతి చట్టాన్ని ప్రభుత్వం అమలులోని తీసుకు వచ్చిందని గుర్తుచేశారు. ఇంకా ఏమైనా పనులు పెండింగ్‌లో లేకుండా చూడాలన్నారు. అనంతరం రైతు వేదికలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అక్కడి నుంచి కొండాపూర్ నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో రవిందర్‌రెడ్డి, తహసీల్దార్ అశోక్, మార్కెట్ కమిటీ చైర్మన్ సడాకుల కుమార్, ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, పీఏసీఎస్ చైర్మన్లు శ్రీకాంత్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, నాయకులు మాజీ ఎంపీటీసీ నర్సింహారెడ్డి, వేంకటేశంగౌడ్, ప్రభుదాస్, నర్సింహులు, మండల యువత అధ్యక్షులు అశోక్, మల్లారెడ్డి, మండల వ్యవసాయధికారి గణేశ్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

కంది, జూన్ 16 : కంది మండలం బేగంపేట్ గ్రామంలో అక్రమంగా ప్రభుత్వ భూమిని కబ్జా చేసి నిర్మాణం చేపడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు సోమవారం కలెక్టర్ ప్రావీణ్యకు ఫిర్యాదు చేశారు. చిద్రుప్ప-బేగంపేట్‌లోని 249 సర్వే నంబర్‌లో ఇదే గ్రామాని చెందిన రాములు గౌడ్ అనే వ్యక్తి సుమారు 20 గుంటల ప్రభుత్వ భూమిని కబ్జా చేసి షెడ్డు నిర్మాణాన్ని చేపట్టాడని, గతంలో ఈ విషయాన్ని మండల, జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావడంతో అధికారులు విచారణ జరిపి పనులు నిలిపివేయించారని గ్రామస్తులు కలెక్టర్‌కు వివరించారు. ప్రస్తుతం ఈ భూమిలో ఉన్న కొన్ని గుంతలను మట్టితో పూడ్చి మళ్లీ నిర్మాణాలు చేపట్టేందుకు సిద్ధమవుతున్నారని అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారి లో గ్రామస్తులు సాయిగౌడ్, శ్రీనివాస్‌గౌడ్‌లు ఉన్నారు.

వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడికి సన్మానం

ఉపాధ్యక్షుడు హన్మంత్‌రెడ్డిని సన్మానిస్తున్న ప్రధాన కార్యదర్శులు

గుమ్మడిదల,జూన్ 16 : వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన హన్మంత్‌రెడ్డిని మెదక్, సంగారెడ్డి జిల్లాల వాలీబాల్ అసోసియేషన్ ప్రతినిధులు సన్మానించారు. సోమవారం సంగారెడ్డి, మెదక్ జిల్లాల వాలీబాల్ అసోసియేషన్ ప్రధానకార్యదర్శులు కే.రవీందర్‌చారి, కృష్ణ హైదరాబాద్‌లో ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జ్ఞాపికలతో సన్మానించినట్లు వారు గుమ్మడిదలలో తెలిపారు. రానున్న రోజుల్లో వాలీబాల్ క్రీడకారులను అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర, జాతీయ స్థాయి వరకు రాణించే విధంగా తమ వంతు సహాయాన్ని అందించాలని కోరినట్లు తెలిపారు.

ప్రణాళిక కార్యక్రమాలు తనిఖీ చేసిన స్పెషల్ ఆఫీసర్

ఏర్పాటు చేయనున్న చెట్ల తొట్టెలను పరిశీలిస్తున్న స్పెషల్ ఆఫీసర్

జిన్నారం, జూన్ 16 : బొల్లారం మున్సిపాలిటీ పరిధిలో కొనసాగుతున్న వంద రోజుల ప్రణాళిక కార్యక్రమాలను మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్, అకౌంట్స్ ఆఫీసర్ రాజేశ్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మధుసూదన్ రెడ్డితో కలిసి ప్రణాళిక కార్యక్రమాలు కొనసాగుతున్న తీరుతెన్నులను తెలుసుకున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రహరీపై వేసిన అవగాహన చిత్రాలను, బతుకమ్మ ఘాటు వద్ద అమృత్ 2.0 ఉమెన్ ట్రీ ప్లాంటేషన్ పనులను పరిశీలించారు. మల్లన్న బస్తీలోని ఓపెన్ నాలా శుభ్రత పనులను స్వయం గా పర్యవేక్షించారు. అనంతరం మున్సిపల్ అధికారులు సిబ్బందితో కలిసి పార్కో మొక్కలు నాటారు. ప్రణాళిక కార్యక్రమాలు జరుగుతున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. మున్సిపల్ మేనేజర్ మల్లికార్జున్ స్వామి, ఆర్వో నర్సింహులు, ఏఈ కిష్టయ్య, వార్డు ఆఫీసర్లు, మున్సిపల్ సిబ్బంది మహేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

జహీరాబాద్, జూన్ 16 : ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలో ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురై విద్యార్థి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన జహీరాబాద్ పట్టణంలోని సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. జహీరాబాద్ పట్టణ ఎస్సై వినయ్‌కుమార్ కథనం ప్రకారం.. పట్టణానికి చెందిన రాయిపల్లి వెంకటరమణ (19) జహీరాబాద్‌లోని ఆర్ఎల్ఆర్ కాలేజీలో ఇంటర్ చదువుకున్నాడు. ఒక సబ్జెక్టులో ఫెయిల్ కావడంతో ఇటీవల జరిగిన సప్లమెంటరీ పరీక్ష రాశాడు. సోమవారం మధ్యాహ్నం ఇంటర్ బోర్డు విడుదల చేసిన పరీక్షల ఫలితాల్లో వెంకట రమణ మళ్లీ ఫెయిల్ అయ్యాడు. మళ్లీ ఫెయిల్ కావడం తో మనస్తాపానికి గురై ఇంటో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి కృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుమ్మడిదల: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌కు మద్దతుగా తెలంగాణ భవనకు చేరుకున్న గుమ్మడిదల, జిన్నారం మండలాల బీఆర్ఎస్ నేతలు



తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డితో నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు

రామచంద్రాపురం: బీఆర్ఎస్ భవన్ ఎదుట నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్ పటాన్‌చెరు ఇన్‌చార్జి ఆదర్శ్‌రెడ్డి

తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

ఫార్ములా ఈరేస్ విచారణలో భాగంగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను సోమవారం ఏసీబీ అధికారులు విచారించారు. ఈ నేపథ్యంలో ఆయనకు మద్దతుగా సంగారెడ్డి జిల్లా నాయకులు హైదరాబాద్‌లోని తెలంగాణ భవనకు భారీ గా తరలివెళ్లారు. ఈ సందర్భంగా సంఘీభావాన్ని తెలిపారు.

-సంగారెడ్డి జిల్లా నెట్‌వర్క్, జూన్ 16

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కోహీర్, జూన్ 16 : మండలంలోని కొత్తూర్(డి) గ్రామ 65వ జాతీయ రహదారి పక్కన సోమవారం ఉదయం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభించింది. ఎస్సై సతీశ్‌వర్మ కథనం ప్రకారం.. కొత్తూర్(డి) గ్రామ జాతీయ రహదారి పక్కన ఉన్న మేత కోసం ఓ రైతు తన పశువులను అక్కడికి తోలుకువచ్చాడు. పశువులు మేత తింటుండగా అక్కడ ఉన్న గడ్డిలో నుంచి దుర్గంధం రావడాన్